క్లుప్తంగా

అవోపా ఆధ్వర్యంలో గోసేవ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరువారి తోటలోని రాధాకృష్ణ గోశాలలో గోసేవ, గోపూజ నిర్వహించారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ మాట్లాడుతూ 75 వారాలుగా గోసేవ చేయడం అభినందనీయమన్నారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కొత్తూరి వెంకట్, ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొనగళ్ల సత్యం మాట్లాడారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోపాల్‌రావు, మద్ది సాయి రమేష్, రమణానంద్, వెంకట్రావు, కంచర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనాన్ని తినాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనాన్ని తినాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి కోరారు. శుక్రవారం రైలుపేటలోని గొలుసు కొండలరావు– నాంచారమ్మ నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలను సందర్శించి, పీఎం పోషణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలారాణితో పాటు ఉపాధ్యాయులు, ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది మధ్యాహ్న భోజనం తినేందుకు ఆసక్తి చూపకపోవడంపై ఆరా తీశారు. మెనూ పాటిస్తూ రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ కోడిగుడ్డు అందించడంతో పాటు చిక్కీ అందజేయాలని కోరారు. మెనూ నాణ్యతలో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. సమావేశంలో గుంటూరు తూర్పు ఎంఈఓ– 2 నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఓమేగా హాస్పిటల్స్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మహతి పేర్కొన్నారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో అధ్యాపకులకు క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ మహతి మాట్లాడుతూ తొలిదశలో గుర్తించడం ద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. క్యాన్సర్ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఎరువుల సమతుల్యతతో అధిక దిగుబడులు

తెనాలిరూరల్: ఎరువులను సమతుల్యంగా వినియోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని లాంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమతుల ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) గుంటూరు, గుంటూరు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి మండలం నందివెలుగు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాదేవి మాట్లాడుతూ రైతులకు సమతుల ఎరువుల యాజమాన్యంపై తగు సూచనలు చేశారు. మట్టి పరీక్షల ఆధారంగా తగిన మోతాదులో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఆత్మ గుంటూరు డెప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇ.వెంకటేశ్వర్లు, వరి యాజమాన్య పద్ధతులపై సూచనలు అందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వనరుల కేంద్రం, ఏఈఓ మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు మౌనిక, గ్రామ రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరంలోని కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టెక్ మహీంద్రా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 38 మంది విద్యార్థులు రూ.3.25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు అర్హత పొందారన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి అన్ని విభాగాల నుంచి ఇప్పటి వరకు మొత్తం 644 మందికి ఎంపికల్లో ఉద్యోగాలు లభించాయని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు ఉద్యోగావకాశాల కల్పనకు బహుళ జాతి కంపెనీలు ముందుకు రావడం విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాలకు నిదర్శనమన్నారు. టెక్ మహీంద్ర నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సీఎస్‌సీ నుంచి 17 మంది, ఐటీ – 11, ఈసీఈ –4, సీఎస్‌బీఎస్ నుంచి ఆరుగురు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉందాం

పార్టీ తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా



సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: కష్టకాలంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉందామని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. స్థానిక తూర్పు నియోజవర్గ పార్టీ కార్యాలయంలో జంబో కమిటీలతో ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి నియోజవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు నియోజకవర్గంలో సుమారు 80 శాతం వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ రాజకీయ పోరాటంలో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. తూర్పు నియోజకవర్గ ప్రజలకు పదేళ్లకుపైగా సేవలందించిన కుటుంబం ముస్తఫా కుటుంబమన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని నియోజకవర్గ ప్రజలకు భరోసా కల్పించారు.

డాక్టర్ రావూరి భరద్వాజ్‌కు నివాళి



భరద్వాజ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుంటూరు మెడికల్: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత కళాప్రపూర్ణ డాక్టర్ రావూరి భరద్వాజ్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక లాడ్జిసెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, గుంటూరు తూర్పు సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ హాజరయ్యారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ నేత మాగంటి సుధాకర్ యాదవ్, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మేడూరి శివ రామబ్రహ్మం, ఉపాధ్యక్షుడు కొత్తూరి మోహన్‌రావు, కార్యదర్శి జంపని రాధాకృష్ణమూర్తి, కోశాధికారి బసవపాత్రుని మల్లికార్జునరావు, ఉప కార్యదర్శి అత్తారి వీరభద్రచార్యులు, రాష్ట్ర వైశ్య బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు హనుమంతరావు ఉన్నారు.

విద్యార్థులు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలి



వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీర రాఘవరావు

కెరీర్ కౌన్సెలింగ్ ట్రైనర్ వీర రాఘవరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగి తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని కెరీర్ కౌన్సెలింగ్ ట్రైనర్ డాక్టర్ వీర రాఘవరావు పేర్కొన్నారు. యువజన సర్వీసులశాఖ, స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో శుక్రవారం సంజీవయ్యనగర్‌లోని డాక్టర్ పినపాటి ప్రభుదాస్ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ప్రమీల అధ్యక్షత వహించారు. వీర రాఘవరావు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంతో విద్యలో రాణించడంతో పాటు భవిష్యత్తులో కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడంలో అవసరమైన సలహాలు అందించారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థులు, యువజనుల కోసం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు 'మానవత' ప్రథమ వార్షికోత్సవం

- నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం
- జీవన సాఫల్య పురస్కారం ప్రదానం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

తెనాలి: రాష్ట్రవ్యాప్తంగా విస్తృత సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సేవాసంస్థ తెనాలి శాఖ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. స్థానిక ఇండస్ట్రియల్ ఏస్టేట్‌లోని కుమార్‌పంప్స్ సత్సంగ్‌హాలులో ఉదయం 10 గంటలకు జరిగే సభలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, జీవనసాఫల్య పురస్కారం ప్రదానం ఉంటాయి. సత్సంగ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌లు కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఓదార్చి ఒక కన్నీటి బొట్టునైనా ఆపడమనే 'మానవత' ఆశయంతో ప్రారంభించిన సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 112 శాఖలు, 76 వేల మంది సభ్యులకు పైగా విస్తరించినట్టు డాక్టర్ రామ్‌చంద్ తెలిపారు. అందులో భాగమైన తెనాలి శాఖ ఏడాది కాలంలో వినూత్న సేవలను అందించినట్టు గుర్తుచేశారు. తొలి జీవన సాఫల్య పురస్కారాన్ని మానవతామూర్తి డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్‌కు బహూకరించనున్నట్టు చెప్పారు. నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు. సంస్థకు ప్రస్తుతం 500 మంది సభ్యత్వం ఉందనీ, రానున్న ఏడాదిలో సభ్యత్వాన్ని వెయ్యి మందికి పెంచాలని నిర్ణయించామని తెలిపారు. వార్షికోత్సవం రోజునుంచి సంస్థ సేవలను విస్తరిస్తామని రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం చెప్పారు. స్వచ్ఛంద సేవపై ఆసక్తి గలవారు సభ్యులుగా చేరి, తమ సేవలను సంస్థ ద్వారా చేపట్టాలని సూచించారు. సంస్థ నూతన అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారి సేవల కోసం ఆవిర్భవించిన సంస్థ సేవలను ముందుకు తీసుకెళతామని చెప్పారు. కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు మాట్లాడుతూ, తెనాలి సమీపంలోని కుంచవరంలో నిర్మించిన మానవత ప్రాంగణంలో మహిళల ఉపాధి కేంద్రం, యువతకు ఉపాధి శిక్షణ, జీవన కళల శిక్షణ అవకాశాలను ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గౌరవ సలహాదారు వెంపటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు (వాసు), కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎస్వీ శర్మ, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి, కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సీహెచ్ సాంబశివరావు, కె.నాగేశ్వరరావు, ఎం.అర్జున, యడవల్లి రోహిణి, పి.మల్లిఖార్జునరావు, ఆర్.భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

• సర్వమంగళ మాంగళ్యే...



తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్, గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూరోడ్ లోని చారిత్రక గోవర్ధన్ స్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక పూజలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం 10 గంటల నుంచి మహిళా భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిషత్, గుంటూరు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ ఈ.అమ్మడు హాజరయ్యారు. వైఖానస ఆగమ రీత్యా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు టి.రఘు, వేదాంతం మాధవ్ కుమార్, టి.శ్రీధర్, వేదాంతం కేశవమూర్తి తదితరులు నిర్వహించారు. ఆలయ కార నిర్వహణ అధికారి ఎన్‌వీఎస్ మల్లేశ్వరి, కార్యక్రమ నిర్వాహకులు వంశీ, సాయి, చంద్రమౌళి పాల్గొన్నారు. –తెనాలి

వైభవంగా స్వామి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్‌లోని గౌరివిశ్వేశ్వరాలయంలోని స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా శుక్రవారం స్వామికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. మల్లాది వెంకటరవి కుమార్, నాగలక్ష్మి, కొణతం శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతులతో అర్చక స్వామి విశ్వేశ్వర శర్మ కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్, మల్లిక్, చక్రపాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆటోలపై కేసు నమోదు



గుంటూరు ఈస్ట్: హిందూ కళాశాల సెంటర్‌లో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటోలపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. మొత్తం 20 ఆటోలపై కేసులు రాసి, రూ.1,30,750 అపరాధ రుసుం వసూలు చేశామని తెలిపారు. ఆటోడ్రైవర్లకు లైసెన్సు, యూనిఫాం, ఇన్సూరెన్సు లేని, డాక్యుమెంట్లు సరిగా లేని ఆటోలపై కేసులు రాసినట్లు వెల్లడించారు. డ్రైవింగ్ లైసెన్సు లేని డ్రైవర్లు లైసెన్సు ఏలా పొందాలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఆటో నడుపుతున్న సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

వైభవంగా శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠం, సాలిగ్రామ మఠం ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం 23వ రోజైన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమాన్ని యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు జరిపించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు లక్ష మల్లెపూజ నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, రావూరు సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, ఏలూరి రాజేశ్వరరావు, చందూరి రాంబాబు, మురికిపూడి కాశీవిశ్వనాథం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు గోపు ప్రభారాణి, గుర్రం పద్మ, సువర్ణ, కనికిచర్ల జానిక, లక్ష్మీకుమారి, చుండూరు వరలక్ష్మి, వసంత పాల్గొన్నారు.

రేపు 'రఫీ సాబ్‌కే యాద్‌మే' సంగీత కచేరీ



తెనాలి: పట్టణానికి చెందిన సంకీర్తన సంస్థ ఆధ్వర్యంలో అమరగాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా 7వ తేదీన 'సుహానీ షామ్', 'రఫీ సాబ్‌కే యాద్‌మే' పేరుతో 7వ వార్షిక సంగీత కచేరీ నిర్వహించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి రాత్రి 9 గంటల వరకు సంగీత కార్యక్రమం జరుగుతుందని సంకీర్తన వ్యవస్థాపకుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు వెల్లడించారు. కార్యక్రమ కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. గాయనీ గాయకులు షేక్ బి.సైదా(తెనాలి), పీఎల్ ఆలీఖాన్ (పొన్నూరు), షేక్ ఖాజా షానవాజ్ (హైదరాబాద్), శారదా రాజా (హైదరాబాద్), ఎం.మల్లిక (తెనాలి), కె.రాజేశ్వరరావు, డాక్టర్ కె.పురుషోత్తమరావులు రఫీ గాత్రంలోంచి జాలువారిన చక్కని గీతాలను ఆలపిస్తారని వివరించారు. సంగీతాభిమానులు, రఫీ ప్రేమికులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

దళిత బహుజనుల ఆత్మబంధువు పాశ్వాన్



పాశ్వాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: దళిత బహుజనుల ఆత్మ బంధువు రాం విలాస్ పాశ్వాన్ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. రాం విలాస్ పాశ్వాన్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద దిక్కుగా వ్యవహరించిన రాంవిలాస్ పాశ్వాన్ ఆయన ఏ ప్రభుత్వంతో కలిసి పనిచేసిన అంతిమంగా అట్టడుగు వర్గాల జాతి ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇచ్చే వారని గుర్తు చేశారు. ఎనిమిది సార్లు లోక్‌సభ సభ్యునిగా, ఒకసారి రాజ్యసభ సభ్యునిగా ప్రధాని వీపీ సింగ్ మొదలుకుని ఆరుగురు ప్రధాన మంత్రుల క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఘనత రాంవిలాస్ పాశ్వాన్‌కే దక్కుతోందని చెప్పారు.

ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కారంచేడు, చుండూరు ఘటనలతో చలించిన రాంవిలాస్ పాశ్వాన్ అప్పటికే రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరహక్కుల రక్షణ చట్టం ఒక్కటే ఎస్సీ, ఎస్టీలకు సరిపోదని, అటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చట్టం తేవాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ, అత్యాచారాల నిరోధక చట్టాన్ని తీసుకురావడంతో కృతకృత్యులయ్యారన్నారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన కులాల అభివృద్ధి సంక్షేమం కోసం, బీపీ మండల్ కమిషన్ అమలు కోసం విశేష కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బాలకృష్ణ, విల్సన్, వినయ్, రామకృష్ణ, రవికుమార్, సుమంత్, కెనడీ పాల్గొన్నారు.

వాహనాలపై కేసులు నమోదు



వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

నెహ్రూనగర్: నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై కేసులు నమోదు చేశామని రవాణా శాఖ జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో పలు ప్రాంతాల్లో మోటార్ వాహన తనిఖీ అధికారులు వాహనాలను తనిఖీ చేసి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 25, ఇన్సూరెన్స్ లేని వాటిపై 31, ఫిట్నెస్ లేని వాహనాలపై 10, పన్ను చెల్లించకుండా వాహనం నడిపిన వారిపై 4, అదనపు ప్రయాణికులను ఎక్కించుకుని తిరుగుతున్న వాహనాలపై 2, పర్మిట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై 2, ఇతర నిబంధనలు పాటించని వాటిపై 7 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబార ఘట్టం



నాటికలోని ఓ దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కళాస్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణరాయబారంలోని మయసభ ఏకపాత్రాభినయం, రాయభార ఘట్టం ప్రదర్శించారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. మయసభలో సుయోధన పాత్రలో అట్ల రామకృష్ణరెడ్డి, రాయభార ఘట్టంలో శ్రీకృష్ణగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, సుయోధనగా షేక్ లాల్‌అహ్మద్, కర్ణగా షేక్ చినలాల్, అశ్వద్ధామగా షేక్ మీరావలి, ధృతరాష్ట్రునిగా షేక్ నాజర్, వికర్ణగా యు.మునుస్వామి, భీష్మగా జె.రాఘవరావు, ద్రోణగా ఆర్.సంగమేశ్వరరావు తమ పాత్రల్లో నటించారు. నాటకాన్ని రక్తికట్టించగా, ప్రేక్షకులను ఆకట్టుకుంది. సంగీత సహకారాన్ని సిరిగిరి సాంబశివరావు అందించగా, డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ పర్యవేక్షించారు. అనంతరం కళాకారులను దేవాలయ పాలక మండలి సత్కరించారు.

ప్రైవేట్ టెలికం కంపెనీలు చార్జీలు పెంచడం అన్యాయం



మాట్లాడుతున్న కొండా శివరామిరెడ్డి

లక్ష్మీపురం: కేంద్రంలో ప్రధాని మోదీ మూడోసారీ పీఠం మీద కూర్చున్న కొన్ని రోజుల్లోనే ప్రైవేటు కంపెనీలు మొబైల్ రీచార్జిల ధరలను భారీగా పెంచి ప్రజలపై రూ.20 వేల కోట్ల భారాన్ని మోపడం దారుణమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం 'అడ్డూ అదుపు లేకుండా ప్రైవేటు టెలికంపెనీల విజృంభణ' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ జనం మొబైల్ అవసరాన్ని లాభాల మూటలుగా మార్చుకోడమే ప్రైవేటు టెలికం కంపెనీల అసలు ఉద్దేశమని విమర్శించారు.

2023–24 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియో రూ.20,607 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా, ఎయిర్ టెల్ రూ.7,467 కోట్ల లాభాన్ని వెనుకేసుకుందన్నారు. ఈ కంపెనీల ధన దాహం తీరలేదని, దేశంలో మొబైల్ ఫోన్లు వాడుతున్న 1.20 కోట్ల మంది నుంచి తలో కొంత అదనంగా పిండుకున్నా వేల కోట్లను సులభంగా గడించవచ్చనే ఈ భారాన్ని వినియోగదారులపై వేశారని ఆరోపించారు. ఎన్నికల బాండ్ల పేరుతో ఈ కంపెనీలు ప్రధాన పార్టీలకు కోట్లాది రూపాయలు ఇచ్చి తమను ఎవరూ ఏమి అనకుండా చేసుకున్నారని విమర్శించారు. న్యాయవాది ఎ. హరి మాట్లాడుతూ మాటికి పరస్పరం పోటీ దారుల మంటూ ఫోజులిస్తూ చార్జీల వడ్డనలో మాత్రం కూడబలుక్కొని వ్యవహరించాయని దుయ్యబట్టారు. ఎక్కువ మంది అనివార్యంగా వాడే ప్లాన్‌ల మీద తెలివిగా భారాలను మోపడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, కార్పొరేట్లకు దోచిపెట్టే ధోరణి ఈ ప్రొవైడర్ల దోపిడీకి మార్గం సుగమం చేస్తున్నాయని ఆరోపించారు.

అలరించిన సింహాచలశాస్త్రి హరికథా గానం



తెనాలి: పట్టణ శ్రీసీతారామ గాన సభ ఆధ్వర్యంలో ఇక్కడి రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరుగుతున్న శాస్త్రీయ సంగీత కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం 'భక్త రామదాసు' హరికథా గానం జరిగింది. కథకులు డాక్టర్ ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి భాగవతార్ భక్తరామదాసు చరితను రసవత్తరంగా హరికథా గానం చేశారు. హరికథ రత్న బ్రహ్మశ్రీ దుర్భా వెంకట శాస్త్రి భాగవతార్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పామర్తి ఆంజనేయ శాస్త్రి వయొలిన్‌పై, కందుల అనిల్‌కుమార్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. శ్రీసీతారామ గానసభ అధ్యక్షురాలు పిరాట్ల రమణి, ఉపాధ్యక్షుడు దుర్భా కౌండిన్య సాయి, కోశాధికారి పరుచూరి సుబ్బారావు, సహాయ కార్యదర్శి కేవీ రామకృష్ణ, సభ్యులు దుర్భా జస్వంత్, డాక్టర్ చింతలపాటి మంజుల పాల్గొన్నారు. ప్రవాస భారతీయులు పవన్ రామ్, కళ్యాణ్ రామ్ ప్రత్యేకంగా విచ్చేశారు.